సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
7
మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



● వంజంగి అందాల కనువిందు

మేఘాలు,పొగమంచు అందాలకు నిలయమైన వంజంగి హిల్స్‌కు పర్యాటకుల రాక మొదలైంది. వేకువజామున తేలిక పాటి మంచు కురుస్తుండడంతో వంజంగి గిరి శిఖరాలపై ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. సోమవారం పర్యాటకులు వంజంగికొండపైకి ట్రెక్కింగ్ నిర్వహించారు. మంచు అందాలను తిలకించారు. – సాక్షి,పాడేరు

న్యూస్‌రీల్

అసైన్డ్ భూములపై హక్కులు పేదలకు వరం

- అసెంబ్లీలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములపై హక్కులు కల్పించి, అర్హులకు పట్టాలు పంపిణీ చేయడం పేదలకు గొప్పవరమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. అసైన్డ్ భూములపై సోమవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పేదలంతా రుణపడి ఉంటారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బడుగు,బలహీన వర్గాలకు అన్నివిధాల బాసటగా నిలుస్తున్న సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. అసైన్డ్ భూములకు హక్కులు కల్పించడం చారిత్రక నిర్ణయమన్నారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, చీఫ్ కమిషనర్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలోని అసైన్డ్ భూముల కమిటీలో తనను భాగస్వామ్యం చేయడం సంతోషంగా ఉందన్నారు. అసైన్డ్ భూముల్లో సాగుదారులను గుర్తించి, వారికి భూమి యాజమాన్య హక్కులు కల్పించి సవరణలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అసైన్డ్ భూములున్న రైతుల జీవితాల్లో గొప్ప మార్పులు, వెలుగులు రాబోతున్నాయని ఆమె పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు



టేకులబోరు సాయిబాబా ఆలయంలో సామూహిక వ్రతం నిర్వహిస్తున్నదంపతులు

కూనవరం: మండలంలోని టేకులబోరు షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం వారి ఆధ్వర్యంలో ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా కూనవరం, టేకులబోరు గ్రామాల్లో సత్యరథంతో ప్రచారం నిర్వహించారు. టేకులబోరులో నిర్వహించిన సత్యదేవుని సామూహిక వ్రతాల్లో 240 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా సామగ్రిని దేవస్థానం సమకూర్చింది. సూపరింటెండెంట్ కేవీవీఎస్ మూర్తి, ఎంవీకే సుబ్రహ్మణ్యం, అర్చకులు వీర్రాజు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష

వైద్య శిబిరాలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- వీడియో కాన్ఫరెన్సులో అధికారులకు ఆదేశం



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: వచ్చేనెల ఒకటో తేదీ నుంచి 45 రోజులపాటు నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఆరోగ్య ఏపీ దిశగా ప్రతి వ్యక్తి ఆరోగ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఇంటింటి సర్వే జరుగుతోందని, తద్వారా అవసరమైన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా బీపీ, షుగర్, పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందజేయాలని ఆదేశించారు. అదే విధంగా దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి వైద్యనిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందించాలని సూచించారు. అవసరమైతే ఉన్నత ఆస్పత్రికి రిఫర్ చేయాలన్నారు. అందుకు అవసరమయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ విషయంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు కీలకపాత్ర వహించాలని సూచించారు. ఇంటింటి సర్వేలో వలంటీర్లు పాల్గొనడం లేదని తన దృష్టికి వచ్చిందని, వారు తప్పనిసరిగా పాల్గొనే విధంగా తగు ఆదేశాలు జారీ చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. అదే విధంగా జిల్లాలో రక్తహీనత, పౌష్టికాహారలోపంతో బాధపడేవారిని గుర్తించి వారి ఆరోగ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జగనన్న ఆరోగ్య శిబిరం కేవలం వైద్యశాఖకు చెందినదిగా భావించవద్దని, ఇందులో స్త్రీ, శిశు సంక్షేమం, విద్యాశాఖ కూడా పూర్తిస్థాయిలో భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో బరువు తక్కువ, రక్తహీనత, ఎదుగుదల లోపం గల పిల్లలను గుర్తించి వారిని కూడా వైద్య శిబిరాలకు తరలించి చికిత్స అందించాలన్నారు. ప్రతి మండలానికి కనీసం ఇద్దరు ప్రత్యేకవైద్య నిపుణులు విధులు నిర్వహిస్తారని, వారి ఫోన్‌నంబర్లను ఆరోగ్యకేంద్రాల వైద్యులకు షేర్ చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో జమాల్‌బాషాకు సూచించారు. జిల్లాలో ప్రతిఒక్కరి హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వచ్చేనెల ఒకటి నుంచి 45 రోజులపాటు 290 జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈనెల 26న మంగళవారం దిగువ మోదాపుట్టులో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్యశిబిరాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహిస్తామని, లోపాలు తెలుసుకుని వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర నోడల్ అధికారి రమేష్‌బాబు, డీసీహెచ్‌ఎస్ కృష్ణారావు, టీబీ నియంత్రణాధికారి విశ్వేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు రోడ్డు పనులు వేగవంతం

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- గూడెం–సీలేరు రోడ్డు పరిశీలన
- నాణ్యత పాటించాలని సూచన



ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గూడెంకొత్తవీధి: సీలేరు రోడ్డు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన గూడెంకొత్తవీధి–సీలేరు రహదారిని పరిశీలించారు. రోడ్డు పనులను సాధ్యమైనంత తొందరలో పూర్తి చేయాలని సూచించారు. అంతరాష్ట్ర రహదారిగా భావించే సీలేరు రోడ్డు పదేళ్లుగా అధ్వానంగా ఉంది. మూడు నెలల క్రితం ఆర్‌అండ్‌బీ అధికారులు 28 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేపట్టారు. గూడెం నుంచి సీలేరు సమీపంలో రెయిన్‌గేజ్ వరకు రోడ్డు వేయాల్సి ఉంది. దీనిపై ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఇది వరకు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన రూ.4.32 కోట్లు కేటాయింపునకు చర్యలు తీసుకున్నారు. ఈ నిధులతో పదిరోజులుగా పనులు జరుగుతున్న నేపథ్యంలో కలెక్టర్ నాణ్యత ప్రమాణాలను పరిశీలించి సూచనలు చేశారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు

నేత్రానందం



పరీక్షిస్తున్న వైద్యుడు

నేత్రాలు ఉంటేనా ప్రకృతి అందాలు చూడగలం. జీవ జాలాన్ని గుర్తించగలం. భవిష్యత్‌ను నిర్దేశించే చూపు లేకపోతే జీవితం అంధకారమే. దీని ప్రాధాన్యతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో చదివే చిన్నారుల నుంచి, వయసు మళ్లిన వారి కోసం వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టింది. అవసరమైన శస్త్రచికిత్సలు, కళ్లద్దాలు ఉచితంగా అందించి నేత్రానందాన్ని ప్రసాదిస్తోంది.

- కంటి సంబంధిత వ్యాధులపై దృష్టి సారించిన ప్రభుత్వం
- వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో ఉచిత సేవలు
- మొదటి, రెండు విడతల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు
- మూడో విడతలో అవ్వాతాతలకు చికిత్స



కంటి పరీక్షల అనంతరం పంపిణీ చేసిన కంటి అద్దాలతో విద్యార్థులు

అరకులోయ టౌన్: జిల్లాలో వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో నాలుగేళ్లుగా విద్యాలయాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొదటి, రెండు విడతల శిబిరాల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేశారు. కళ్లద్దాల పంపిణీ చేపట్టారు. ప్రస్తుతం సాగుతున్న మూడో విడతలో అవ్వా, తాతలకు కంటిపరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్య పరీక్షల కోసం అవ్వ, తాతలు ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఊరిలోనే వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రితోపాటు ఏరియా ఆస్పత్రుల్లో, పీహెచ్‌సీల్లో వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో పరీక్షలు చేసి, ఉచితంగా ఆపరేషన్ చేస్తున్నారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి కళ్ల అద్దాలను అందజేస్తున్నారు.



మూడో విడతలో..

జిల్లాలోని 22 మండలాల్లో 60 ఏళ్లు దాటిన 87,204 మంది అవ్వాతాతలను గుర్తించి వీరిలో 75, 966 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 31,364 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వీరిలో ఇప్పటి వరకు 26,861 మంది అవ్వా, తాతలకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. అంతర కుసుమాల సమస్యను 2,196 మందిలో గుర్తించారు. వీరిలో 1020 మందికి శస్త్ర చికిత్స చేశారు.

స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో..

2022–23వ ఆర్థిక సంవత్సరంలో స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలో 28,206 విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 1536 మంది పిల్లలకు దృష్టి లోపాలు గుర్తించి కంటి అద్దాలు అందించినట్లు అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ విశ్వేశ్వర నాయుడు తెలిపారు.

● కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద కంటి శస్త్రచికిత్స చేయించుకుంటే ఆస్పత్రిలో ఉన్న రోజులు ఉచిత భోజన, వసతి కల్పించి, సర్జరీ అనంతరం రోగితో పాటు అటెండెంట్‌కు బస్సు చార్జీలు ప్రభుత్వం చెల్లిస్తోంది. అంతే కాకుండా చికిత్స అనంతరం డాక్టర్లు సూచించిన కాలానికి రోజుకు రూ. 225 చొప్పున గరిష్ఠంగా రూ. 5వేలు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రోగి బ్యాంక్ ఖాతాలో జమచేస్తోంది.

అవగాహనకు ప్రాధాన్యం

గతనెల 25 నుంచి ఈనెల 8వ తేదీ నిర్వహించిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా పీహెచ్‌సీల పరిధిలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

● వయసు పైబడిన కారణంగా వృద్ధుల్లో కంటి పొరలు దెబ్బ తినడం, గ్లకోమా, బీపీ, మధుమేహం వల్ల రెటీనా దెబ్బతింటున్నాయి. ఇలాంటి కేసులకు వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

ఉచితంగా శస్త్ర చికిత్స

చూపు మందగించిందని అరకు ఏరియా ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. సర్జరీ అవసరమని చెప్పారు. దీంతో విశాఖలోని ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రికి వెళ్లాను. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కంటి వెలుగు కింద పైసా ఖర్చు లేకుండా శస్త్రచికిత్స చేసి కంటి అద్దాలు ఉచితంగా అందించారు.

– ఎస్. సోమేశ్వరరావు, అరకులోయ.

వెలుగు నింపుతోంది



వైఎస్సార్ కంటి వెలుగు అవ్వాతాతల్లో వెలుగు నింపుతోంది. ఇప్పటికే రెండు విడతలుగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన సేవలందించాం. ప్రజల్లో నేత్రదానంపై అవగాహన అవగాహన కల్పించేందుకు ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంను భాగస్వాములను చేశాం.

– డాక్టర్ పి. విశ్వేశ్వర నాయుడు, జిల్లా ప్రోగాం మేనేజర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పాడేరు

ఇదీ గంటా ‘స్కిల్’!

తప్పుడు సర్వేలతో ముదపాక భూముల వ్యవహారంలో బండారు.. మోసపూరిత విధానంతో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తమ ‘స్కిల్’ కనబరిచారు. ఐటీ రిటర్న్స్ కూడా దాఖలు చేయని తన సతీమణి పేరుతో ఏకంగా రూ.92 లక్షలకుపైగా నగదుతో గంటా భీమిలిలో కొనుగోలు చేసిన భూ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమైంది. నిబంధనలకు విరుద్ధంగా భారీ నగదుతో జరిపిన లావాదేవీల్లో పేర్కొన్న పాన్ నంబర్ కూడా తేడాగా ఉండటం గమనార్హం.

- భీమిలిలో భారీ నగదుతో 1,938 చ.గ స్థలం కొనుగోలు
- భార్య పేరుతో భూ వ్యవహారం చేసినట్టు ఒప్పందం
- ఆమె పేరుతో ఐటీ రిటర్న్స్‌ను దాఖలు చేయని వైనం
- అఫిడవిట్‌లో ఒకటి.. అగ్రిమెంటులో మరో పాన్‌కార్డు నెంబరు
- ఐటీ శాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం





గంటా ఎన్నికల అఫిడవిట్‌లో తన సతీమణి గంటా శారద 2014 నుంచి 2019 వరకూ ఐటీ రిటర్న్స్ దాఖలు చేయనట్లుగా చూపించిన వైనం


సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా! అన్న చందంగా.. తెలుగుదేశం పార్టీ నేతలు తమ నాయకుడి తరహాలోనే కనికట్టు చేయడంలో ఆరితేరిపోయారు. ఒకవైపు స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో బోగస్ కంపెనీలతో కోట్లు కొట్టేసి జైలులో చంద్రబాబు ఉన్నారు. తాను తక్కువేమీ కాదన్నట్టు... భీమిలిలో తన సతీమణి పేరు మీద కొనుగోలు చేసిన భూ వ్యవహారంలో గంటా కూడా అదే తరహా ‘స్కిల్’ కనబరిచారు. ఆదాయపన్నుశాఖ నిబంధనలకు విరుద్ధంగా కేవలం నగదు రూపంలో రూ.92 లక్షలకుపైగా చెల్లింపులు ఆయన సతీమణి పేరు మీద చేసినట్టు లెక్కల్లో చూపారు. అయితే, ఆమె తరపున ఐటీ రిటర్న్స్‌ను ఎక్కడా దాఖలు చేయకపోవడం గమనార్హం. గంటా శ్రీనివాసరావు భీమిలి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే... భీమిలి ప్రాంతంలో 1,936 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన కొనుగోలు ఒప్పందంలో గంటా వ్యవహరించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది.

అంతా నగదు రూపంలోనే...!

ఆదాయపన్నుశాఖ చట్ట ప్రకారం రూ. 2 లక్షలకు మించి నగదు లావాదేవీలు చేపట్టరాదు. ఈ నిబంధనలేవీ తెలియని వ్యక్తి కాదు గంటా శ్రీనివాసరావు. అయితే తన సతీమణి పేరుతో 2018లో భూముల కోనుగోలులో నగదు రూపంలోనే మెజార్టీ వ్యవహారం నడవడం విమర్శలపాలవుతోంది. అంతేకాకుండా ఆయన మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఈ విధంగా జరగడం బహుశా యాదృచ్ఛికం కాకపోవచ్చు. రూ.92.98 లక్షలు కేవలం నగదు రూపంలో ఇచ్చినట్టు చూపారు. మరో రూ. 25 లక్షలను ఆర్‌టీజీఎస్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసినట్టు చూపి.. సర్వే నెంబరు.. టీఎస్ నెంబరు 1490, బ్లాక్ నెంబరు 17, వార్డు నెంబరు 24లోని 1936 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఒకవేళ ఇంత భారీ స్థాయిలో నగదు లావాదేవీలు జరిపితే పాన్‌నెంబరు పేర్కొనడంతో పాటు ఐటీ రిటర్న్స్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒకవైపు తన అఫిడవిట్‌లో గంటా శారద 2014–15 నుంచి 2018–19 మధ్య ఒక్కసారి కూడా ఐటీ రిటర్న్స్ దాఖలు చేసినట్లు చూపించలేదు. మరోవైపు గంటా శ్రీనివాసరావు మాత్రం 2014–15 నుంచి ఐటీ రిటర్న్స్‌ను దాఖలు చేసినప్పటికీ 2018–19 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.30,39,338 ఆదాయంగా చూపడం గమనార్హం. ఆదాయపన్నుశాఖ సెక్షన్ 271 డి ప్రకారం... రూ. 2 లక్షలకు మించి నగదు లావాదేవీలను నిర్వహిస్తే శిక్షార్హుడు అవుతారు. ఆదాయపన్నుశాఖ సెక్షన్ 269 ఎస్‌టీ ప్రకారం అంతే మొత్తాన్ని పెనాల్టీ రూపంలో వసూలు చేసే అధికారం ఉంది.






Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 8,00,000/- Paid by way of cash
Rs. 6,00,000/- Paid by way of cash
Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 12,00,000/- Paid by way of cash
Rs. 10,00,000/- Paid by way of cash
Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 8,00,000/- Paid by way of cash
Rs. 10,00,000/- Paid by way of cash
Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 4,00,000/- Paid by way of cash
Rs. 6,98,000/- Paid by way of cash
Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 25,00,000/- Paid by way of RTGS on

పరిమితికి మించి నగదు చెల్లింపులు చేసినట్లుగా కొనుగోలు ఒప్పంద కాపీ

రెండు పాన్‌కార్డులు ఉండొచ్చా..!



PAGE NO.1
IN FAVOUR OF
Smt. GANTA SARADA, (Pan No. ABPPG 2216A) aged 50 years, W/o. Sri. Ganta Srinivasa Rao, residing at Plot No. 231, Door No. 1-84-16/1, Sector-4, M.V.P.Colony, Visakhapatnam, herein after called the "VENDEE" which term shall mean and include her heirs, executors, administrators and assignees on the other

భూ కొనుగోలు డాక్యుమెంట్‌లో గంటా సతీమణి పేరుతో ఉన్న పాన్‌కార్డు నంబర్



Spouse G sarada	ABPPG2215A	Returns not yet filed	(i) (ii) (iii)

ఎన్నికల అఫిడవిట్‌లో గంటా సతీమణి పాన్‌కార్డ్ నంబర్

భీమిలిలో భూములు కొనుగోలు చేసిన సందర్భంలో ఆయన సతీమణి పేరు మీద పేర్కొన్న పాన్ కార్డు నెంబరు ఏబీపీపీజీ2216ఏ. అయితే, ఆయన అఫిడవిట్‌లో మాత్రం తన సతీమణి పాన్ నెంబరు ఏబీపీపీజీ2215ఏగా పేర్కొన్నారు. వాస్తవానికి ఐటీశాఖ నిబంధనల ప్రకారం రెండు పాన్ కార్డు నెంబర్లను కలిగి ఉండటం చట్టరీత్యా నేరం.

రెండు పాన్‌కార్డులు ఏ సమయంలో ఉంటాయంటే...

● అప్పటికే ఉన్న పాన్‌కార్డులో ఏవైనా తప్పులు ఉంటే... వాటిని సరిచేసుకోకుండా కొత్త దానికి దరఖాస్తు చేయడం. ● పాన్‌కార్డు కోసం పలు మార్లు దరఖాస్తు చేయడం ● పెళ్లికి ముందు ఒక పాన్‌కార్డు... పెళ్లి తర్వాత మరో పాన్‌కార్డుకు మహిళలు దరఖాస్తు చేసిన సమయంలో... ● ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టే ఉద్దేశంతో అక్రమంగా రెండు పాన్‌కార్డులను కలిగి ఉండటం.

ఇందులో ఏదైనా చట్టరీత్యా నేరమే. తమకు ఉన్న రెండు పాన్‌కార్డులను వెంటనే తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఆదాయపన్నుశాఖ చట్టరీత్యా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే, ఈ వ్యవహారంలో నిజంగా రెండు పాన్ కార్డులు ఉన్నాయా? ఒకే సిరీస్‌లో కేవలం నెంబరు మార్చి తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో ఈ వ్యవహారం నడిచిందా? అనేది లోతుగా విచారిస్తే మినహా తెలిసే అవకాశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏదీ ఏమైనా తెలుగుదేశం నేతలు అవినీతి వ్యవహారంలో చూపుతున్న ‘స్కిల్’ మాత్రం కొంగొత్త పుంతలు తొక్కుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వేధింపులు తాళలేక

కడతేర్చారు

- కిరాయి వ్యక్తులతో కలిసి కన్నకొడుకు గొంతు కోసిన తల్లిదండ్రులు
- రూ.3 లక్షలకు సుపారీ
- మిస్టరీని చాకచక్యంగా ఛేదించిన పోలీసులు



హత్య ఘటన వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ మహేందర్‌రెడ్డి

ఎటపాక: తల్లిదండ్రులే కన్నకొడుకుని చంపింరానే నిజం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈనెల పదో తేదీన ఎటపాక మండలం రాయనపేట పంచాయతీ పరిధిలోని తుమ్మలనగర్ సమీపంలో సగం కాలిన మృతదేహాన్ని గుర్తించిన స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ వేగవంతం చేశారు. మృతుడు తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని మెడికల్ కాలనీకి చెందిన పగిల్ల దుర్గాప్రసాద్‌గా గుర్తించారు. ఈ హత్య ఘటన వివరాలను రంపచోడవరం అడిషనల్ ఎస్పీ కేవీ మహేందర్‌రెడ్డి సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మృతుడు దుర్గా ప్రసాద్‌కు తల్లిదండ్రులు సావిత్రి, రాము మధ్య తరచూ ఆస్తి తగదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇల్లు తనకు రాయాలంటూ దుర్గాప్రసాద్ తరచూ మద్యం సేవించి ఇంట్లో గొడవ పడేవాడు. దీంతో విసిగిపోయిన తల్లిదండ్రులు ఇల్లు అమ్ముకుని వేరే ప్రాంతానికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. అయితే ఇల్లు అమ్మేందుకు కన్నకొడుకు దుర్గా ప్రసాద్ అడ్డంకిగా మారడంతో ఎలాగైనా అంతమొందించాలన్న నిర్ణయానికి వచ్చారు. భద్రాచలం పట్టణంలోని జగదీష్‌కాలనీకి చెందిన గుమ్మడి రాజు, షేక్ అలీపాషాకు రూ.3 లక్షల సుపారి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈనేపథ్యంలో ఈనెల 9వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న దుర్గా ప్రసాద్‌ను వారిద్దరితోపాటు తల్లిదండ్రులు కలిసి కత్తితో పీక కోసి చంపేశారు. మృతదేహాన్ని ఆటోలో తీసుకుని సరిహద్దునే ఉన్న ఆంధ్రా పరిధిలోని తుమ్మలనగర్ సమీపంలో పొదల మాటున పడేసి పెట్రోల్ పోసి నిప్పుపెట్టి వెళ్లిపోయారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ వేగవంతం చేశారు. హత్యకు పాల్పడిన నలుగురు ఈనెల 25న చత్తీస్‌గఢ్ వైపు వెళ్లిపోతుండగా పురుషోత్తపట్టణం చెక్ పోస్టు వద్ద వారిని సీఐ గంజేంద్రకుమార్, ఎస్ఐ పార్థసారథి అదుపులోకి తీసుకున్నారని అడిషనల్ ఎస్పీ వివరించారు. చాకచక్యంగా నిందితులను పట్టుకున్న వారిని ఆయన అభినందించారు.

సింహగిరిపై రెండో రోజు పవిత్రోత్సవాలు



అప్పన్న ఉత్సవమూర్తులు చెంతన వేద పఠనాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామివారిని వేద పఠనాలతో అర్చకులు కొలిచారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. నాలుగు వేదాలతో స్వామిని కొలిచారు. అలాగే కల్యాణ మండపంలోనే ఏర్పాటుచేసిన హోమగుండం వద్ద విశేష హోమాలు, రాత్రి అదివాస పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ పూజలు జరిపారు. మూడో రోజు మంగళవారం రాత్రి పవిత్ర సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి భక్తిగీతాలు, భజన పోటీలకు దరఖాస్తులు

జి.మాడుగుల: జిల్లా స్థాయి భక్తిగీతాలు, భజన పోటీలను విశాఖపట్నం భీమిలి సద్గురు సేవాశ్రమం, శ్రీ హనుమ సేవాశ్రమం ఆధ్వర్యంలో నవంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు భీమిలి సద్గురు సేవాశ్రమం శ్రీహనుమ సేవాశ్రమం ప్రతినిధి సాయిరామ్ స్వామిజీ ఒక ప్రకటనలో తెలిపారు. జి.మాడుగుల గాంధీనగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ, భజన సంప్రదాయ సంరక్షణ, భజన సంఘాలను, భజన కళాకారులను ప్రోత్సహించానికి జిల్లా స్థాయి పోటీలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పోటీల్లో ప్రథమ విజేత భజన బృందానికి రూ.10,000, ద్వితీయ బహుమతి రూ.5,000, తృతీయ బహుమతి రూ.3,000 అందజేయనున్నట్టు తెలిపారు. పోటీల్లో పాల్గొనే భజన బృందాలు నియమ నిబంధనలు పాటించాలని, గిరిజన మండలాలు భజన బృందాలకు మాత్రమే పోటీల్లో ఆవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440970580, 9347284674, 9494159896 నంబర్లకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

కుటుంబ సమస్యలతో ఒకరి ఆత్మహత్య

అనకాపల్లిటౌన్: కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడని గ్రామీణ ఎస్‌ఐ సీహెచ్.నర్సింగరావు తెలిపారు. మండలంలో కొత్తూరు గ్రామానికి చెందిన టి.గురుస్వామి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఈ ఘటనపై మృతుడి భార్య అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

నేడు సాగరమాలలో రోజ్‌గార్ మేళా

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం సాలగ్రామపురంలో గల సాగరమాల కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం రోజ్‌గార్ మేళా నిర్వహించనున్నారు. విశాఖపట్నం డివిజన్, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళాకు ముఖ్య అతిథిగా కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ సహాయ మంత్రి నారాయణస్వామి హాజరుకానున్నారు. ఈ మేళాలో నూతనంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేస్తారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రారంభించనున్నారు.

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు


కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో పనులను పర్యవేక్షిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్


భారీ క్రేన్ల సాయంతో పునరుద్ధరణ పనులు

- నేడు కూడా పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ కేకే లైన్‌లో మనబార్-జరటి స్టేషన్ల పరిధిలో ఆదివారం తెల్లవారుజామున రైల్వే ట్రాక్‌పై కొండచరియలు విరిగిపడిన సంగతి తెలిసిందే. దీంతో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, సంబంధిత అధికారులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పునరుద్ధరణ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. అత్యధిక సామర్థ్యం గల మెషినరీ, మెటీరియల్స్‌తో ట్రాక్‌పై పడిన బండరాళ్లు, కొండచరియలను తొలగిస్తున్నారు. ఈ కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను మంగళవారం కూడా గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

గమ్యం కుదించిన రైళ్లు

సోమవారం రూర్కెలాలో బయల్దేరిన రూర్కెలా-జగదల్‌పూర్(18107)ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు నడిచింది. తిరుగు ప్రయాణంలో మంగళవారం జగదల్‌పూర్ - రూర్కెలా(18108) ఎక్స్‌ప్రెస్‌గా కోరాపుట్ నుంచి బయల్దేరి రూర్కెలా చేరుకుంటుంది. సోమవారం భువనేశ్వర్‌లో బయల్దేరిన భువనేశ్వర్-జగదల్‌పూర్ (18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడిచింది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్- భువనేశ్వర్(18448) ఎక్స్‌ప్రెస్‌గా కోరాపుట్ నుంచి మంగళవారం బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది. విశాఖలో సోమవారం రాత్రి బయల్దేరిన విశాఖ-కిరండూల్ (18514) ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్ - విశాఖ (18513)ఎక్స్‌ప్రెస్‌గా కోరాపుట్ నుంచి మంగళవారం బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. విశాఖలో మంగళవారం బయల్దేరే విశాఖ-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్ - విశాఖ(08552)పాసింజర్ స్పెషల్‌గా మంగళవారం అరకు నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. హౌరాలో సోమవారం బయల్దేరిన హౌరా-జగదల్‌పూర్(18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్ - హౌరా (18006) ఎక్స్‌ప్రెస్‌గా టిట్లాఘడ్ నుంచి మంగళవారం బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

అరకు కాఫీ మార్కెటింగ్‌కు చక్కని వేదిక


బెంగళూరులో ప్రపంచ కాఫీ సదస్సుకు హాజరైన ఐటీడీఏ పీవో అభిషేక్, కేంద్ర కాఫీ బోర్డు, ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులకు స్వాగతం

- అరకు ఎంపీ మాధవి
- ప్రపంచ కాఫీ సదస్సుకు హాజరైన అధికారులు, అభ్యుదయ రైతులు

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): బెంగళూరులో జరుగుతున్న ప్రపంచ కాఫీ సదస్సు-2023 అరకు కాఫీ మార్కెటింగ్‌కు చక్కని వేదిక అని అరకు ఎంపీ,కేంద్ర కాఫీ బోర్డు సభ్యురాలు గొడ్డేటి మాధవి అన్నారు. బెంగళూరు ప్యాలస్‌లో సోమవారం ప్రారంభ మైన ప్రపంచ కాఫీ సదస్సులో పాడేరు ఐటీడీఏ,జీసీసీ ఏర్పాటు చేసిన అరకు కాఫీ పెవిలియన్‌ను ఆమె, ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బెంగళూరు ప్యాలస్‌లో ప్రపంచ వ్యాప్తంగా 80దేశాల ప్రతినిధులతో జరుగుతున్న ప్రపంచ కాఫీ సదస్సులో మన రాష్ట్రం నుంచి పాడేరు ఐటీడీఏ,జీసీసీ అధికారులు,కాఫీ రైతులు, గిరిజన థింసా కళాకారులు పాల్గొనడం శుభపరిణామమన్నారు. అరకు కాఫీని ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేయడంతో పాటు, భవిష్యత్‌లో కాఫీ మార్కెటింగ్‌కు విస్తృత అవకాశాలు ఏర్పడతాయన్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ అరకు కాఫీని ప్రపంచ దేశాలలో మార్కెటింగ్ చేసే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో కాఫీ సాగును మరింత విస్తరించే లక్ష్యంతో ఉన్నామన్నారు. గిరిజన రైతులు ముందుకు వస్తే అన్ని విధాల ఐటీడీఏ ప్రోత్సహిస్తుందన్నారు. మాజీ మంత్రి మణికుమారి, జీసీసీ ఎండీ సురేష్ కుమార్, జనరల్ మేనేజర్ యూస్తఫ్, మినుములూరు కాఫీ బోర్డు ఎస్ఎల్‌వో రమేష్, ఐటీడీఏ కాఫీ ఏడీ అశోక్, గిరిజన కాఫీ రైతులు, కాఫీ రైతు ఉత్పత్తి సంఘాల ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు.


సదస్సులో అరకు కాఫీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ గొడ్డేటి మాధవి, ఐటీడీఏ పీవో అభిషేక్

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన తప్పనిసరి

- నోవర్టిస్ ఆరోగ్య పరివార్ ప్రోగ్రాం మేనేజర్ సతీష్‌కుమార్


మాట్లాడుతున్న ప్రోగ్రామ్ మేనేజర్ సతీష్‌కుమార్

సాక్షి,పాడేరు: సికిల్‌సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదని, వంశపారం పరంగా వ్యక్తులకు సంక్రమిస్తుందని నోవర్టిస్ ఆరోగ్య పరివార్ ప్రోగ్రాం మేనేజర్ సతీష్‌కుమార్ తెలిపారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహాలకు ముందు యువతీ, యువకులు రక్తపరీక్షలు చేసుకోవడం ద్వారా ముందుగానే సికిల్‌సెల్ ఎనిమియా లక్షణాలను తెలుసుకోవచ్చన్నారు. ఈ వ్యాధి లక్షణాలు ఉన్నవారు సకాలంలో వైద్య పరీక్షలు జరుపుకుని వైద్యసేవలు పొందాలని,నాణ్యమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. సికిల్‌సెల్ ఎనీమియా కేసులు మన్యంలో అధికంగా ఉన్నాయని, వారికి మెరుగైన వైద్యసేవలతో పాటు ప్రభుత్వం ప్రతినెల రూ.10వేలు పింఛన్ సౌకర్యం కల్పించి ఎంతో మేలు చేస్తోందన్నారు. మహిళా సాధికారిక కన్వీనర్ అశ్వినిరెడ్డి మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా ఎక్కువగా బాలికలు, మహిళల్లోనే ఉందన్నారు. గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఎస్ఎస్ దత్తత గ్రామాల్లో వలంటీర్లంతా సికిల్‌సెల్ ఎనీమియాపై విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ఎన్ఎస్ఎస్ పీవోలు పి.రమేష్‌కుమార్, గౌరీశంకరరావు, అధ్యాపకులు శంకర్రావు, అమిత్ కుమార్, అచ్యుత్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


డొక్కా శివరామ కృష్ణ (ఫైల్)

అడ్డతీగల: మండలంలో పింజరికొండ జలపాతంలో ఆదివారం గల్లంతైన తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన డొక్కా భద్ర వెంకట శివరామకృష్ణ(55) మృతదేహం సోమవారం లభ్యమైంది. పింజరికొండ జలపాతం చూసేందుకు ఆదివారం స్నేహితునితో కలిసి వచ్చాడు. ఇద్దరు జలపాతం ఎగువన బండరాయిపై కూర్చున్నాడు. అదేసమయంలో హఠాత్తుగా ఏలేరు వాగు ఉధృతి పెరగడంతో ఇద్దరు ప్రవాహంలో పడిపోయారు. వీరిలో స్నేహితుడు బయటకు రాగా శివరామకృష్ణ కొట్టుకుపోయాడు. వెంటనే సమాచారం తెలుసుకున్న అడ్డతీగల పోలీసులు, స్థానికులు అతని జాడ కోసం ఆదివారం సాయంత్రం నుంచి గాలించారు. సోమవారం సాయంత్రం లభ్యమైందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. మృతుడు శివరామరకృష్ణ కోరుకొండ మండలం కోటికేశ్వరం పీహెచ్‌సీ పరిధిలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య ఉన్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

- ప్రకృతి వ్యవసాయం ఎంసీఆర్పీ అప్పలరాజు


అజోల్లాపై అవగాహన కల్పిస్తున్న అప్పలరాజు

రాజవొమ్మంగి: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో చీడపీడలను నివారించుకోవడమే కాక, పంటలో సూక్ష్మ పోషకాల లోటుకు కూడా సరిదిద్దుకోవచ్చని మండలంలోని ప్రకృతి వ్యవసాయం, రైతు సాధికార సంస్థ ఎంసీఆర్పీ అప్పలరాజు అన్నారు. కొమరాపురం యూనిట్ లోదొడ్డిలో ఆయన రైతులకు జిల్లేడు ద్రావణం తయారీపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ ద్రావణాన్ని పంటలపై పిచికారీ చేయడం వల్ల రసం పీల్చే పురుగును నివారించుకోవచ్చన్నారు. 200 లీటర్ల నీటిలో 20 కిలోల జిల్లేడు ఆకులు, 10 లీటర్ల ఆవు మూత్రంతో ఈ ద్రావణాన్ని మూడు రోజుల్లో పొలంలోనే తయారీని వివరించారు. ఏ పంటపై అయినా ఈ ద్రావణాన్ని ఉపయోగించుకోవచ్చని, దీని వల్ల పంటలో సూక్ష్మ పోషకాల లోపాన్ని సరిదిద్దుకోవచ్చన్నారు. వరి నాట్లు పూర్తయిన వెంటనే పొలంలో అజోలా వేసుకొంటే కలుపు నివారించుకోవచ్చని, అజోలా వల్ల మొక్కలకు నత్రజని అందుతుందని రైతులకు వివరించారు. అజోలా వల్ల భూమిలో తేమను కాపాడుకోవచ్చన్నారు. ఐసీఆర్పీలు లోవరెడ్డి, శ్రీను, రైతులు కోపూరి సోమరాజు, బూసరి సత్తిబాబు, పొత్తూరి వెంటేశ్వర్లు, జర్తా లక్ష్మి, బోడమ్మ పాల్గొన్నారు.

నేడు కేంద్ర ఉక్కు సహాయ మంత్రి ఫగ్గాన్ పర్యటన

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి శాఖల సహాయ మంత్రి ఫగ్గాన్ సింగ్ కులస్తే మంగళవారం స్టీల్‌ప్లాంట్ సందర్శించనున్నారు. సాయంత్రం ఆయన హిల్‌టాప్ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి ఉక్కు అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌కు వెళతారు. అక్కడ ఉక్కు యాజమాన్యం అందించే కార్పొరేట్ ప్రజంటేషన్ తిలకించనున్నారు. అనంతరం ఉక్కు అధికారుల సంఘం, కార్మిక సంఘాలు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలతో సమావేశమై, రాత్రి హిల్‌టాప్ గెస్ట్ హౌస్‌లో బస చేయనున్నారు. బుధవారం ఉదయం ఢిల్లీకి బయలుదేరనున్నారు.

గంగవరంలో భారీ వర్షం


కోతకు గురైన రహదారి


మరమ్మతు అనంతరం డైవర్షన్ రోడ్డు

- కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్లు

గంగవరం: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి కాలువలు పొంగి ప్రవహించడంతో రహదారులు ఛిద్రమైయాయి. ఐ.పోలవరం సెంటర్ నుంచి అడ్డపల్లి వరకు వరకు జరుగుతున్న 516 ఈ జాతీయ రహదారి నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారిలో వాగులు, కొండ వాగుల వద్ద నిర్మిస్తున్న కల్వర్టులు, బ్రిడ్జిల డైవర్షన్ రోడ్లు దెబ్బతిన్నాయి. కుసుమరాయి జంక్షన్ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద డైవర్షన్ రోడ్డు వాగు ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో సోమవారం ఉదయం నుంచి గంగవరం - రంపచోడవరం మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో రంపచోడవరం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు వయా కొత్తపల్లి, ఓజుబంద జంక్షన్ మీదుగా నడిచాయి. కొట్టుకుపోయిన డైవర్షన్ రహదారి సాయంత్రానికి తాత్కాలికంగా ఎన్‌హెచ్ సిబ్బంది బాగు చేయడంతో వాహన రాకపోకలు ప్రారంభమయ్యాయి.సూరంపాలెం రిజర్వాయర్‌లోకి భారీగా వరదనీరు చేరింది.

హుకుంపేట: మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారిలో నీరు నిలిచిపోయింది.

టెన్త్‌లో మెరిట్ విద్యార్థికి నగదు బహుమతి

- ఏటా రూ.20 వేలు కేటాయింపు
- ఇస్రో పూర్వ డైరెక్టర్ నారాయణరావు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఇస్రో పూర్వ డైరెక్టర్ ఆచార్య నారాయణరావు

సాక్షి,పాడేరు: కిల్లోగుడ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో టెన్త్ కామన్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థికి ఏటా రూ.20 వేల నగదు బహుమతిని అందజేస్తానని ఇస్రో పూర్వ డైరెక్టర్, ఎస్ఆర్ఎం గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రిసెర్చ్) ఆచార్య డి.నారాయణరావు ప్రకటించారు. సోమవారం ఆయన అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా కిల్లోగుడ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. అత్యధిక మార్కులు సాధించే దిశగా ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే నగదు బహుమతి పంపిణీకి నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రభుత్వం గిరిజన విద్యకు అందిస్తున్న సౌకర్యాలు, వసతులను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు కూడా అన్ని సబ్జెక్టుల్లో నాణ్యమైన విద్యాబోధన అందించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లకే వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీలకు అడ్డతీగల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అడ్డతీగల: ఏపీ స్టేట్ స్కూల్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల రెజ్లింగ్ చాంపియన్‌షిప్ అండర్-14 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఇద్దరు గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 21 నుంచి 23 వరకూ విజయవాడ నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ పోటీలు జరిగాయి. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన కుంజం వెంకన్నదొర 48 కిలోలు, పిట్టా నిఖిల్‌రెడ్డి 55 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం వరప్రసాద్ తెలిపారు. వచ్చేనెల ఒకటో తేదీన మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు, పీఈటీ బండారు మల్లేశ్వరరావును ఆయనతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు అభినందనల వెల్లువ


జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్రతో ఉద్యోగులు

మహారాణిపేట: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా జె.సుభద్ర పదవి చేపట్టి దిగ్విజయంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీరాజ్ ఎస్ఈ రవీంద్ర, ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ మహేంద్ర, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు, కార్యదర్శి సీతారామరాజు, జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ తదితరులు సుభద్రను పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సుభద్ర మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్‌గా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొని మూడో ఏడాదిలోకి అడుగు పెడుతున్న తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. గడచిన రెండు సంవత్సరాల్లో ఎన్నో విజయాలు సాధించామన్నారు. మారుమూల ప్రాంతంలో ఉన్న తనను ఈ పదవిలో కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రయాణంలో ఎంతో మంది సహకారం అందించారని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

అందుబాటులోకి మెరైన్ మ్యూజియం!

- ప్రారంభించిన కేంద్ర మత్స్యశాఖ మంత్రి రూపాల
- అనంతరం వాణిజ్య, ఆక్వా ప్రతినిధులతో సమావేశం


మెరైన్ మ్యూజియంను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రూపాలా


మత్స్య జాతులను తిలకిస్తున్న రూపాలా

సాక్షి, విశాఖపట్నం: విశాఖ బీచ్‌రోడ్డులో ఉన్న ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) భవనంలో ఆధునీకరించిన మెరైన్ మ్యూజియాన్ని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పరుషోత్తమ్ రూపాలా సోమవారం ప్రారంభించారు. ఈ మ్యూజియంలో అరుదైన 250 రకాల మత్స్య జాతులను ప్రదర్శనకు ఉంచారు. వీటిని మంత్రి పరిశీలించారు. ఆయా జాతుల ప్రత్యేకతలను, ఏఏ ప్రాంతాలు, దేశాల సముద్ర జలాల్లో ఇవి లభ్యమవుతాయో ఎఫ్ఎస్ఐ అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి మత్స్య పరిశ్రమ, సీఐఐ, చాంబరాఫ్ కామర్స్, ఆక్వా ఎగుమతుల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి వివిధ అంశాలు, సమస్యలను తీసుకెళ్లారు. ఈక్వెడార్.. వివిధ దేశాలకు తక్కువ ధరకే మత్స్య ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని, దీని ప్రభావం మన మత్స్య ఎగుమతులపై తీవ్రంగా పడుతోందని సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్ చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంటుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ జనాభా చైనాకంటే అధికంగా ఉన్నప్పటికీ చేపల వినియోగం ఆ దేశంకంటే తక్కువగా ఉందని, వీటి వినియోగం పెరిగేలా చర్యలు చేపట్టాలని మరో ప్రతినిధి సూచించారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డును హైదరాబాద్ నుంచి విజయవాడకు గాని, విశాఖకు గాని మార్చాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి శ్రీనాథ్ విజ్ఞప్తి చేశారు. ఎగుమతుల్లో ప్రోత్సాహకాలు పెంచాలని, ఆక్వా మేత ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సీఐఐ ప్రతినిధి కోరారు. ఈ ప్రతినిధుల సూచనలు, అభ్యర్థనలను పరిశీలిస్తానని కేంద్ర మంత్రి రూపాలా హామీ ఇచ్చారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, ఎఫ్ఎస్ఐ డీజీ జయ భాస్కరన్, విశాఖ ఎఫ్ఎస్ఐ మెకానికల్ మెరైన్ ఇంజనీర్ భామిరెడ్డి, శాస్త్రవేత్త ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ, ఇతర అధికారులు, ఆక్వా రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

29న రంపచోడవరంలో జాబ్‌మేళా

అడ్డతీగల: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29 న రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో టైర్స్, డిమార్ట్ రెండు కంపెనీల్లో ఉద్యోగాల ఎంపిక కోసం ఆరోజు ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు ఎంపికలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని 18 నుంచి 24 సంవత్సరాల మధ్య వయసు గల టెన్త్, ఇంటర్, డిగ్రీ ఆపై చదువులు పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అభ్యర్థులు పాన్ కార్డు, ఆధార్ కార్డు, ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని ఆయన కోరారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.14 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 6304634447లో సంప్రదించాలని ఆయన కోరారు.